# వైద్యశిబిరానికి 'స్పందన'

## 1000 మందికి వైద్యపరీక్షలు



వైద్యశిబిరంలో బారులు తీరిన ప్రజలు

రేపల్లె రూరల్, సెప్టెంబరు 19 (న్యూస్‌టుడే): **'ఈనాడు-సుఖీభవ'**, ప్రవాసాంధ్రులకు చెందిన **'స్పందన ఛారిటబుల్ ట్రస్టు'** ఆధ్వర్యంలో రేపల్లెలో మంగళవారం గన్యా ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో దాదాపు వెయ్యిమంది రోగులకు పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. రేపల్లెలో గత రెండునెలల కాలంలో తీవ్ర రూపం దాల్చిన ఈ వ్యాధికి ఎందరో మంచం పట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు రోగపీడితులతో నిండిపోయాయి. పట్టణంలోని పలువార్డుల్లో రోగపీడితులున్నారు. 20వ వార్డు నేతాజీనగర్‌లో ఇంటింటికి ఒకరు వ్యాధితో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ జరిగిన వైద్య శిబిరంలో ఎందరో పేద, మధ్య తరగతికి చెందిన రోగులు సాంత్వన పొందారు. సుమారు రూ. లక్ష విలువైన మందులను ప్రవాసాంధ్రులకు చెందిన 'స్పందన ఛారిటబుల్ ట్రస్టు పంపిణీ చేసింది. తొలుత వైద్యశిబిరం ప్రారంభసభలో ప్రభుత్వ వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ గన్యాపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. దోమలవల్ల వ్యాప్తి చెందుతున్న వ్యాధి పట్టణంలోని మురికివాడల్లో త్వరగా వ్యాపిస్తోందన్నారు.. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తేఈ వ్యాధి వ్యాప్తిని నిరోధించవచ్చన్నారు. పట్టణంలో గన్యా బాధితుల వేదనకు స్పందించిన 'స్పందన ట్రస్టు', 'ఈనాడు-సుఖీభవ'కు ఆయన అభినందనలు తెలిపారు. ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ లీలా కృష్ణకుమారి, డాక్టర్ ఉషారాణి, మాజీ ఐ.ఎం.ఎ. అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మేకా కోటేశ్వరరావు, డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, సీనియర్ వైద్యులు డాక్టర్ కె.రాజేశ్వరరావులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల ల్యాబ్ టెక్నీషియన్ కె.సాంబశివరావు, సహాయకుడు వెంకటేశ్వరరావు, శ్రీను, ఫార్మాసిస్టులు మధులత, కె.సాంబశివరావు, విశ్వేశ్వరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పర్యవేక్షకులు పెనుమూడి నాగరాజు, ఆరోగ్య కార్యకర్తలు వాణిశ్రీ, కృష్ణకుమారి, పార్వతి, శైలజ సహకారమందించారు.



శిబిరంలో మందుల పంపిణీ